ప్రజాశక్తి

శుక్రవారం 25 జులై 2025 | 5 | విజయనగరం

నేడు జిల్లాలో వర్షాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం 24గంటల్లో మరింత బలపడే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో జిల్లాలో శుక్రవారం వర్షాలు పడే అవకాశముందని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు. మన్యం జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అక్కడి కలెక్టర్ ఆదేశించారు.

ఎంఎస్ఎంఇ పార్కు పనులు ఆపకపోతే ఆందోళన ఉధృతం

గిరిజనులు స్పష్టీకరణ

రెవెన్యూ కార్యాలయంలో అధికారుల చర్చలు

గిరిజనులకు న్యాయం చేయాలని అధికారులను ప్రశ్నిస్తున్న సిపిఎం నాయకులు బలస శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల్లో జరుగుతున్న ఎంఎస్ఎంఇ పార్కు పనులు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గిరిజనులు హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిదులు, వామపక్ష నాయకులు, గిరిజనులతో తహశీల్దార్ అజురఫీ జాన్, ఎపిఐఐసి అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2015లో ఎపిఐఐసికి సుమారు 187 ఎకరాలు ప్రభుత్వం కేటాయించిందని, ఆ భూముల్లోనే గిరిజనులు పంటలు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. అయితే ఒక సంస్థకు కేటాయించిన భూములను గిరిజనులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని, అప్పట్లో ఈ భూమి కోసం ఎపిఐఐసి సుమారు రూ.7 కోట్లు చెల్లించిందని తెలిపారు. అంతేకాకుండా కాకర్లవలస, కారేడువలస గిరిజనులకు 2021లో రిజర్వు ఫారెస్టుకు సంబంధించి భూములు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. వాటిని సాగు చేయకుండా ఎపిఐఐసికి కేటాయించిన భూముల్లో పంటలు సాగుచేయడం సరి కాదన్నారు. గిరిజనులు స్పందిస్తూ ఎపిఐఐసికి ఆ భూములను కేటాయించక ముందే తాము ఈ బంజరు భూములను సాగుచేసుకుంటున్నామని, దానిపై వేలాది రూపాయల మదుపులు పెట్టి పంటలు వేసుకొని జీవనం సాగిస్తున్నామని, నిరుపేద గిరిజనులమైన తమకు ఆ భూమిపై పూర్తి హక్కులు ఉన్నాయని తౌడమ్మ అనే గిరిజన మహిళ వాదించారు. తమకు తెలియకుండా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అప్పట్లో రెవెన్యూ అధికారులు ఎపిఐఐసికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆ భూములను తాము వదులుకునే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. సుమారు 60 కుటుంబాలు ఆ భూములను తాతముత్తాతల నుంచి సాగుచేసుకుంటున్నామని, అటువంటి భూములను తమ నుంచి స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని తెలిపారు. ఇప్పటికే తాము సాగుచేసుకుంటున్న భూమిలో జెసిబి సాయంతో మొక్కలను ధ్వంసం చేశారని తెలిపారు.

సిపిఎం నాయకులు బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ జెసిబిలతో తొలగించిన భూములకు నష్టపరిహారం చెల్లించడమే కాకుండా ప్రస్తుతం గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్వాకం వలన గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, సాగుచేసుకుంటున్న భూముల లబ్దిదారులకు నోటీసులు ఇవ్వకుండా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసామని, అప్పటివరకు ఈ ఎంఎస్ఎంఇ పార్కు పనులు నిలుపుదల చేయాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 28,673 హెక్టార్లలో వివిధ పంటలు సాగువుతున్నాయని, రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జులై నెలకు యూరియా 6,825 మెట్రిక్ టన్నులు, డిఎపి 4591 మెట్రిక్ టన్నులు, పొటాష్ 290 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 2117 మెట్రిక్ టన్నులు, సూపర్ 585 మెట్రిక్ టన్నులు మొత్తంగా 14,408 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని మంత్రి చెప్పారు. ఇప్పటివరకు యూరియా 5008 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. డిఎపి కూడా 2908 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, పొటాషియం 527 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,396 మెట్రిక్ టన్నులు సూపర్ పాస్ఫేట్ 680 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. గత రెండు రోజులుగా చూసుకున్నట్లయితే మనకు రెండు వాగన్‌ల ఎరువులు వచ్చాయని తెలిపారు. దీనిలో ఆర్ఎఫ్‌సిఎల్ కంపెనీ నుంచి 737 మెట్రిక్ టన్నుల యూరియా, సిఐఎల్ కంపెనీ నుండి 634 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరిందని తెలిపారు. ఆర్‌సిఎఫ్ కంపెనీ నుంచి 820 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందని పేర్కొన్నారు. జిల్లాలో ముందస్తుగా వర్షాలు పడటంతో గత ఏడాది తో పోల్చినపుడు సుమారు తొమ్మిది వేల హెక్టార్లలో అధికంగా పంటల సాగు జరిగిందని తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాలో రైతులకు కావాల్సిన 5వేల మెట్రిక్ టన్నుల యూరియా, 1500 మెట్రిక్ టన్నుల డిఎపి కోసం వ్యవసాయ అధికారుల ద్వారా కమిషనర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. నానో యూరియా, నానో డిఎపి కూడా ప్రతి రైతు సేవాకేంద్రం లో అందుబాటులో ఉందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

రైతు బజార్ స్థలంపై నిజ నిర్ధారణ చేపట్టాలి

- స్థలం కబ్జాకు అధికారులు వత్తాసు
- పోరాడితేనే రైతులకు ప్రత్యామ్నాయం చూపించారు : సిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతు బజార్ స్థలంపై ప్రభుత్వం నిజ నిర్ధారణ చేపట్టి ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బజారు స్థలం కబ్జాకు గురైందని, కబ్జాదారులకు ప్రభుత్వ అధికారులే వత్తాసు పలుకుతున్నారని అన్నారు. ఆ స్థలం 1965 తరువాత 1999 వరకు ప్రభుత్వ ఆసుపత్రి గాను, 1999 తర్వాత రైతు బజార్ గాను ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిందని. రైతులు ప్రభుత్వానికి అద్దెలు కూడా ఇప్పటివరకు చెల్లించారని తెలిపారు. కనీసం ముందస్తు నోటీసులు జారీ చేయకుండా రైతులను ఖాళీ చేయించి అశోక్ గజపతి గారికి స్థలం అప్పజెప్పేందుకు అధికారులు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఇదే విషయంపై పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఇతర ప్రజాసంఘాలు, సిపిఎం పార్టీ పోరాటాలు నిర్వహించి రైతులకు అండగా నిలిచాయి తప్పా మిగతా ఏ పార్టీలూ రైతులకు అండగా నిలవలేదని అన్నారు. చివరకు పోరాట ఫలితంగా అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలను ఏర్పాటు చేసారని, ఇది పోరాట విజయమని అన్నారు. రైతుబజారును యథావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నప్పుడు సుప్రీంకోర్టు ఆ స్థలాన్ని అశోక్‌గజపతిరాజుకు అప్పజెప్పాలని స్టే ఇచ్చిందని చెబుతున్నారు తప్పా స్థలం వారిదని చెప్పటానికి ఎటువంటి ఆధారాలు చూపించటం లేదని అన్నారు. కావున ఉన్న ఫలంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలం ప్రైవేట్ స్థలం ఎలా అయ్యిందో ప్రభుత్వ అధికారులే నిజనిర్ధారణ చేసి ప్రజలకు వెల్లడించాలని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. దానాలు చేసి దాతృతాన్ని చాటుకున్న అశోక్ గజపతిరాజు 45 మంది రైతులకు జీవనోపాదిని చూపించే రైతు బజారు స్థలంపై ఆశపడటం సమంజసం కాదని అన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సభ్యులు రెడ్డి శంకర్రావు, టివి రమణ పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 28 న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్ల అందరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు పిలుపునిచ్చారు. గురువారం కోట జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ల తో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో ఆటో, మ్యాక్సీ క్యాబ్ వాహన డ్రైవర్లకు జరిగే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారో చెప్పాలని అన్నారు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కు వాహన మిత్ర ద్వారా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోటార్ వాహన చట్టం అమల్లో భాగంగా వేదాంత ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్‌ను అచ్చుతాపురం లో ఏర్పాటు చేశారని, దీంతో డ్రైవర్లకు తీవ్ర ఆర్థిక భారం తో పాటు సమయం వృథా అవుతుందన్నారు. వాహన రెన్యువల్, రిజిస్ట్రేషన్, లైసెన్స్ వంటి సేవలన్నింటికీ ఆర్టీవో అధికారులే బాధ్యత వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, రద్దు చేయక పోగా ఫీజులు, పెనాల్టీలు, టోల్, గ్రీన్ టాక్సు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పట్టణంలో ఆటోలు నిలుపుదలకు పార్కింగ్ స్థలాలు లేవని, అవి కేటాయించాల్సిన అధికార యంత్రాంగం ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఈ చలనాలు, పెట్టి కేసులు నమోదు చేస్తున్నాయని, స్టాండ్ లు వారీగా వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఆటో,క్యాబ్ డ్రైవర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.పాపారావు, కె.రామునాయుడు, జి.కూర్మారావు, రామారావు, బంగార్రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ విభాగంలో కమాండో శిక్షణ పూర్తి చేసుకొని, జిల్లాకు కేటాయించిన నలుగురు ప్రొబిషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కె.సాయిరాం, కె.దుర్గా ప్రసాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. శిక్షణ ఏవిధంగా సాగినది, శిక్షణలో నేర్చుకున్న అంశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిందితులు శిక్షింపబడే విధంగా కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన పొందేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, వివిధ రకాలైన పోలీసు స్టేషను రికార్డులు, దర్యాప్తు మెళుకవులను తెలుసుకోవాలని ఎస్‌పి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. ఎన్.గోపాల నాయుడు, ప్రొబిషనరీ ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కే.సాయిరాం, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విలీన ప్రాంత కార్మికులకు రూ.18500 ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గాజులరేగ, అయ్యన్నపేట, జమ్ము నారాయణపురం, ధర్మపురి విలీన ప్రాంత కార్మికులకు ఆప్కాస్ లో ఉన్న ఇంజినీరింగ్ కార్మికులతో సమానంగా పెరిగిన వేతనాలు రూ.18500 చెల్లించాలని కోరుతూ గురువారం నగర పాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్యకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు, నాయకులు కె.ఆదినారాయణ, భాస్కర్ రావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వాటర్ సప్లై విభాగంలో పనిచేస్తున్న వారిని ఆప్కాస్ లో చేర్చకపోవడం వల్ల అన్యాయం జరిగిందని తెలిపారు. ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ఇచ్చిన జీవో ఆధారంగా తమకు రూ.18500 చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

27న ఉపాధ్యాయ పోస్టులకు రాత పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కంటోన్మెంట్‌లోగల సెయింట్ ఆన్స్ బాలికల ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్‌జిటి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈనెల 27న గురజాడ స్కూల్‌లో ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తామని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్ , ఏదైనా ఒక ఫోటో గుర్తింపు కార్డు తీసుకొని హాజరు కావాలని తెలిపారు.

120కిలోల గంజాయి స్వాధీనం

- 8మంది నిందితులు అరెస్ట్ • మరో నిందితుడి కోసం గాలింపు : ఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితులను చూపుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

భోగాపురం మండలం రాజాపులోవ వద్ద భోగాపురం పోలీసులు , ఈగల్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు విజయనగరం నుండి మూడు కార్లలో వస్తున్న 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 120కిలోల గంజాయిని, తొమ్మిది సెల్ ఫోన్లును సీజ్ చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజాపులోవ జంక్షను వద్ద వాహన తనిఖీలు చేపట్టగా, విజయనగరం నుండి మూడు కార్లలోవస్తున్న ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుండి 47 ప్యాకెట్లులోగల 120కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా లంతావూర్ బ్లాక్ బల్లేల్ గ్రామానికి చెందిన కొర్రా కిరణ్ (21), మనోజ్ బిసాయ్ (20), ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం హాపూర్ జిల్లా లక్ష్మణపుర గ్రామానికి చెందిన బిజేంద్ర (46), ఢిల్లీలోని పాత సీంపూర్ ప్రాంతానికి చెందిన పాజిల్ (30), ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బుదాన్ జిల్లా సక్రి జంగిల్ గ్రామానికి చెందిన ముఖ్తర్ అహ్మద్ (43) అహిర్వారా గ్రామానికి చెందిన రామ్మోహన్ (21), కాశగాని జిల్లా కుల్లి గ్రామానికి చెందిన సోను (34), శిల్పి (30)గా గుర్తించామని తెలిపారు. నిందితులు గంజాయిని ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలకు రవాణ చేయాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన గంజాయి వ్యాపారులతో సంబధాలున్నాయన్నారు. మరో నిందితుడు అజిత దడక పరారయ్యారని, అతడిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు. వీరికి ఒడిశాలో గంజాయి వ్యాపారులతో ఉన్న పరిచయాలతో గంజాయిని కొనుగోలు చేసి, ట్రైన్, కార్లలో ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గంజాయిని కార్లలో విజయనగరం మీదుగా విశాఖపట్నం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వీరిపై ఫైనాన్సియల్ ఇన్విస్టిగేషను, పిట్ ఎన్.డి.పి.ఎస్. చట్టం ప్రకారం దర్యాప్తు చేస్తామని, పిడి యాక్టు కూడా ప్రయోగిస్తామని ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, గంజాయిని సీజ్ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సిఐ కె.దుర్గాప్రసాద్, ఈగల్ సిఐ టెంక కళ్యాణి, ఎస్ఐ పి.పాపారావు, పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ కె.దుర్గా ప్రసాద్, ఈగల్ సిఐ టి.కళ్యాణీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తుల రిజిస్ట్రేషనప్పడే ప్రాపర్టీ టాక్స్ టైటిల్ ట్రాన్స్‌ఫర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవనాలు, ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్ అయినప్పుడే ఆస్తిపన్ను బదిలీ అవుతుందని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఈవిషయం వెల్లడించారని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో రిజిస్ట్రేషన్ అగు భవనాలు, ఖాళీస్థలాల ఆస్తిపన్ను మ్యుటేషన్ చేసేందుకు అనుసంధాన ప్రక్రియ పై పలు సూచనలు చేశారని తెలిపారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలలో వర్తించే ఆస్తి రిజిస్ట్రేషన్, ఆస్తిపన్ను అంచనాలు, యాజమాన్య నవీకరణల కోసం ఎండ్ టు ఎండ్ ఇంటిగ్రేషన్ ప్రక్రియ ద్వారా ఆటో మ్యుటేషన్ జరుగుతుందని తెలిపారు. అసెస్మెంట్ నెంబరు కలిగియున్న పూర్తి ఆస్తి భాగానికి టైటిల్ ట్రాన్స్‌ఫర్, అసెస్మెంట్ నెంబరు లేకుండా ఉన్న పూర్తి ఆస్తి భాగానికి, అసెస్మెంట్ నెంబరు కలిగి ఉన్న ఆస్తిలో భాగానికి టైటిల్ ట్రాన్స్‌ఫర్ అవుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లో అర్బన్ ఆస్తుల ఆటో మ్యుటేషన్ అమలు చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రజలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఐవిపి రాజుకు గుర్తింపేదీ?

- అందని ద్రాక్షగానే ఎమ్మెల్సీ పదవి
- 28ఏళ్లగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిలోనే..

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాడుతూ 28ఏళ్లగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్న నగరానికి చెందిన ఐవిపి రాజుకు సరైన గుర్తింపు లభించడం లేదని ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. విజయనగరం టిడిపి నాయకులు అనగానే టక్కున గుర్తుకు వచ్చే వ్యక్తుల్లో ఐవిపి రాజు ఒకరు. ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిన 1982లో ఆవిర్భావం రోజునే హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం జిల్లా తరపున తీసుకున్న ప్రథమ వ్యక్తుల్లో ఐవిపి రాజు ఒకరు. విజయనగరం ఎన్‌టిఆర్ అభిమాన సంఘం ప్రెసిడెంట్ గా ఎన్నికైన ఆయన అనతి కాలంలోనే జిల్లా యూత్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. తరువాత 14సార్లు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 28ఏళ్లగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. నేటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. పార్టీని నమ్ముకుని, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ఆయన కేంద్ర మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు నమ్మక బంటుగా కుడి భుజంగా ఉంటూ వస్తున్నారు అటువంటి ఆయనకు అనేకసార్లు అటు పార్టీ అధిష్టానం చంద్రబాబు నాయుడు ఇటు చంద్రబాబు నాయుడు తరువాత అంతటివారు అశోక్ గజపతిరాజుకు నమ్మినబంటుగా ఉన్నారు. పలుమార్లు ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చంద్రబాబుతో హామీ ఇచ్చారు. కానీ ఎమ్మెల్సీ పదవి అందని ద్రాక్షగానే మిగిలింది. పార్టీలో కొత్తగా చేరిన వారికి సైతం పదవులు వరిస్తున్నా..ఆయనకు మాత్రం ఏ పదవీ రావడం లేదని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడుతున్న వారిని పార్టీ గుర్తించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

రోగాల గుర్తింపులో పరికరాలు కీలకం

అంతర్జాతీయ సదస్సులో సెంచూరియన్ విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు తదితరులు

నేడు కొత్త కొత్త రోగాలను గుర్తించడంలో అత్యాధునిక వైద్యపరికరాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్ స్మార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ (ఐహెచ్‌సిఎస్ఎఎ) పై జరిగిన మూడు రోజుల సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వైద్యపరికరాల రూపకల్పన ఇంజనీరింగ్, వైద్య రంగాలు కలసి పనిచేయడం వల్ల అది సాధ్యపడుతుందన్నారు. రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కూడా కీలక పాత్ర పోషించ నుందన్నారు. ఇక్కడ ఇంజినీరింగ్ విద్యతోపాటు పారా మెడికల్ అండ్ అల్లీడ్ హెల్త్ సైన్స్ కోర్సులు నిర్వహిస్తున్నందున సదస్సు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా ఇన్నోవేషన్స్ ఇన్ హెల్త్ కేర్ స్మార్ట్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సుకు ప్రధాన వక్తగా పాల్గొన్న సౌదీ అరేబియా ఖాసిమ్ యూనివర్శిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్ కుమార్ చల్లా మాట్లాడుతూ ప్రపంచ జనాభా 800 కోట్లలో దాదాపు 13 శాతం మంది మధుమేహం బారిన పడుతున్నారని వారిలో 7 శాతం మంది కంటి చూపును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా మధుమేహ గ్రస్తులలో రెటినోపతిని గుర్తించగలిగితే కంటి చూపు కోల్పోకుండా వారిని కాపాడగలమన్నారు. కార్యక్రమంలో ఎఎంసి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అప్పారావు, మోడ్రన్ టెస్ట్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేంద్ర మిశ్రా, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ డాక్టర్ విజయ్ బాబు, డాక్టర్ నాగ, డాక్టర్ నూకరాజు, సెంచూరియన్, విజ్ఞాన్, గీతం, రామచంద్ర, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసి తీరుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

సూపర్ 6 హామీలన్నీ అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా గురువారం తలారి గ్రామంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో ఉదయం ఇంటింటికి విస్తృతంగా తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి హయాంలోనే తలారి గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు జీ.ఎస్ నాయుడు, నాయకులు కిలపర్తి హరి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ పట్ల అవగాహన ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

శక్తి యాప్ పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపారు.కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మహిళా పోలీసులు, వన్ స్టాప్ సెంటర్ అధికారులు విద్యార్థులకు శక్తి యాప్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, సోషల్ మీడియా ప్రభావానికి గురి కావద్దన్నారు. ప్రతీ విద్యార్థి శక్తి యాప్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆపద సమయంలో శక్తి ఎస్ఒఎస్ కాల్ ను ఉపయోగించి పోలీసుల సహాయం ఏవిధంగా పొందవచ్చునో వివరించారు. గుర్తు తెలియని వ్యక్తుల ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించవలసి వచ్చినపుడు యాప్ లోని సేఫ్ ట్రావెల్ ఆప్షన్ వినియోగించి సురక్షితంగా గమ్య స్థానం చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శిరీష, వన్ స్టాప్ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నుంచి బెహరా శంకరరావు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యూనియన్ విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించిన గౌరవ అధ్యక్షులు బెహరా శంకరరావును తొలగించినట్లు శ్రీ శ్రీ విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా తెలిపారు. గురువారం 30 స్టాండులతో ఎఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి రెడ్డి నారాయణరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ అధ్యక్షులు బెహరా శంకరరావు యూనియన్ చీల్చడానికి గత రెండేళ్లగా కుట్రలు పన్నుతూ, నాయకత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను గౌరవాధ్యక్ష పదవి నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించారు.

ఇ- పంట నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ, సింగవరం గ్రామాల్లో ఈ పంట నమోదు ప్రక్రియను ఎఒ బి. సంగీత గురువారం పరిశీలించారు. డెంకాడ గ్రామంలో బ్యాంకులను సందర్శించి కౌలుదారులకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంక్ మేనేజర్లుతో మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంను సందర్శించి ఎరువులను భూమి కలిగిన రైతుకు ఒకటి చొప్పున ఆధార్ కార్డు చూసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.బిను పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పొన్నగంటి తులసమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు 21వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి పొన్నగంటి శంకర్రావు ఆశాపు వీధి, కస్పిలవీధిగల నగరపాలక సంస్థ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు గురువారం మధ్యాహ్న భోజన స్టీల్ ప్లేట్లు మరియు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు కనకల సత్యనారాయణ మూర్తి, ముప్ప రాజు, బోని కుమారస్వామి, కామన శ్రీనివాసరావు, దుద్దు విశ్వేశ్వరరావు, కోమాకు వెంకటర్రావు , బోని శ్రీనివాసరావు, దాసరి అంజిబాబు, పొన్నగంటి లావణ్య హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టి రామినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వంగర

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేద్కర్ గురుకులంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నిస్వార్థ సేవే పరమావధి

ప్రజాశక్తి - రామభద్రపురం

పేద ప్రజలకు నిస్వార్థ సేవే పరమావధిగా కారుణ్య ఫౌండేషన్ ద్వారా నిరంతర సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ జెసిరాజు తెలిపారు. గురువారం బొబ్బిలి ఉపఖజానాధికారి వెంకట పద్మనాభం ఆధ్వర్యంలో నాయుడువలస ఎస్సీ కాలనీలో సుమారు 30వేలు విలువ చేసే 70 దోమ తెరలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ సొంతలాభం కొంత మాని.. పొరుగు వానికి తోడు పడవోయ్ అనే గురజాడ సందేశాన్ని కారుణ్య సంస్థ అమలు చేస్తుందని కొనియాడారు. ఇటీవల పేద బాలిక వివాహానికి ఇప్పటివరకు 30 వేలతో సహాయం చేయడం, వ్యాధులు, రోగాలు ప్రబలే ఈ కాలంలో దోమల వల్ల సంభవించే వ్యాధుల నియంత్రణకు దోమతెరలు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఎఎన్ఎమ్ భవాని, గ్రామపెద్దలు గురువులు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

వీలుపర్తిలో ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో గురువారం ఉచిత పశుగర్భకోశ, ఆరోగ్య శిబిరం వేపాడ పశువైద్యాధికారి డాక్టర్ కొరాడ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. 20 మంది పాడి రైతులకు చెందిన 25 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రైతులకు వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలు మీద అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో టిడిపి నాయకుడు శానాపతి అప్పారావు, వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

మండలంలోని సవరవల్లి సచివాలయం పరిధిలో ఇటీవల బదిలీ అయిన ఉద్యోగులను గురువారం సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమలో ఎంపిటిసి పట్నా తాతయ్యలు, మాజీ ఉప సర్పంచ్ పూసర్ల వెంకటరమణ, కొచెర్ల సత్యనారాయణ, అంగన్వాడి వర్కర్స్, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ప్రజాశక్తి- రేగిడి

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఎల్‌టి సురేష్, ఐసిఆర్‌పి రవి అన్నారు. ఉంగరాడలో గురువారం ప్రకృతి సేద్యంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో నారు శుద్ధి చేయడం వల్ల వేరుకు ఆశించిన శిలీంద్రాలను సూక్ష్మజీవులను నశింప చేసి పైరుకు ఎటువంటి తెగుళ్ల నుండి పైరును కాపాడుతుందో వివరించారు. మంచి దిగుబడులు వస్తాయన్నారు. రైతులు బీజామృతంను తప్పనిసరిగా వాడాలని అన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు జరగనివ్వొద్దు

ప్రజాశక్తి - చీపురుపల్లి

అసాంఘిక కార్యక్రమాలకు లాడ్జిలు నిలయాలు కాకూడదని చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదర్ రావు లాడ్జి యజమానులకు సూచించారు. గురువారం పట్టణంలో గల పలు లాడ్జిలను ఆయన తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యజమానులకు పలు సూచనలను చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా లాడ్జీలకు వచ్చినట్లయితే తక్షణమే పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని కోరారు. అనుమానస్పద వ్యక్తులు లాడ్జీలకు వస్తే అద్దెగదులను ఇవ్వరాదని సూచించారు. అనుమానస్పద వ్యక్తులకు రూములు ఇచ్చినా, లాడ్జిలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్ ఇరిగేషన్ పై శిక్షణ

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 7వ మైనర్ ఇరిగేషన్, 2వ వాటర్ బాడీస్‌పై తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ ఇచ్చారు. మైనర్ ఇరిగేషన్ ప్రాధాన్యత తెలియజేశారు. గణన సకాలంలో పూర్తి చెయ్యాలని రెవెన్యూ అధికారులును ఆదేశించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ యమ్.భానుమూర్తి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ యు. సురేష్ నిర్వహించారు.

ఆక్రమణ నుంచి భూమిని కాపాడండి

కెవెల్ పురం రైతులు వేడుకోలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెవెల్ పురం సూర్యగార్డెన్ సర్వే నెంబర్ 142/143 లో భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని కెవెల్ పురం రైతులు కోరుతున్నారు. సర్వే నెంబర్ 142/143లో మూడు కుటుంబాలకు చెందిన భూమి ఉందని, భూమి పంపకం విషయంలో కోర్టులో వివాదం నడుస్తుందని తెలిపారు. ఈ భూమి మెత్తం 11 సెంటులు కోర్టులో ఉన్నప్పటికి అక్రమంగా కొంతమంది పెత్తందార్లు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని మీడియాకు తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా యథేచ్ఛగా కొంతమంది కార్పొరేటర్ సహాయంతో నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. అక్రమ నిర్మాణాపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ బాలాజీరావు

మొబైల్ దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం రైల్వే స్టేషను ఫ్లాట్ ఫారంలో తనిఖీలు చేస్తుండగా విశాఖ జిల్లా గోపాలపట్నం ప్రహ్లాదపురానికి చెందిన దున్న లక్ష్మణ్ తప్పించుకుని పారిపోతుండగా పట్టుకున్నట్లు రైల్వే ఎస్ఐ వి.బాలాజీ రావు తెలిపారు. అతని నుంచి లక్ష రూపాయలు విలువ చేసే నాలుగు సెల్ ఫోన్‌లు పట్టుకుని సిజ్ చేసి విశాఖ రైల్వే కోర్టుకు తరలించామని తెలిపారు. విశాఖ జిఆర్‌పి డిఎస్‌పి పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు విశాఖపట్నం లైన్స్ సిఐ ఎ.రవికుమార్ ఆధ్వర్యంలో విజయనగరం సిబ్బంది, జిఆర్‌పి సిబ్బంది కలిసి పట్టుకున్నామన్నారు

మోసగించడంలో చంద్రబాబు దిట్ట : వైసిపి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో గురువారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు మురళి, వైసిపి పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ముకుందపురం, ఓబులయ్యపాలెం, పాటూరు గ్రామాలలో ఎంపిపి డి. సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు పాలనలో చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పి.లక్ష్మి, సర్పంచులు ఎం.గంగరాజు నకరావ్, ఉప సర్పంచ్ స్వర్ణపుడి వెంకటరమణ, నాయకులు దుల్ల మహేష్, అన్నపూర్ణ, దివదారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భోగాపురంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

డెంకాడ: శుక్రవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు భోగాపురం మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని సవరవిల్లి

పూసపాటిరేగ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గ్రామంలో వైసిపి మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. శుక్రవారం సవరవిల్లి, తూడేం, కౌలువాడ, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర రావు హాజరవుతారని ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని కోరారు.

బొండపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని, వాస్తవాలను గ్రహించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గుర్తించుకోవాలని ఎంపిపి చల్ల చలంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు ప్రజలకు వివరించారు. గురువారం మండలంలోని ముద్దూరు, తమటాడ, బిల్లలవలస గ్రామాలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, నాయకులు బోడసింగి జగదీశ్వరరావు, పల్లి రఘు, సాలాపు పెంటంనాయుడు, సర్పంచ్ లు మునకాల పైడిపు నాయుడు, కర్రోతు శ్రీనివాసరావు, ఎంపిటిసి సుంకరి కృష్ణవేణి, బండారు శ్రీనివాసరావు, తాళ్ళపూడి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ వేమలి వెంకటరావు, సీనియర్ పార్టీ నాయకులు సుంకరి శ్రీనివాసరావు, రౌతు సూరి బాబు, సుంకరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటి రేగ: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రెడ్డి ద్వారానే ఈ రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతాదని మాజీ ఎమ్మెల్యే బట్టుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని పూసపాటి పాలెం, కుప్పెర్ల, వెల్దురు, తిప్పలవలస, కోనాడ, ఎల్వీ పాలెం గ్రామాల్లో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు ఎం.సత్యనారాయణ రాజు, అల్లాడ రమేష్, నాయకులు రేగాని శ్రీనివాసరావు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దన్ రావు, దాడిశెట్టి త్రినాథ రావు, బర్రి చిన్నప్పన్న, పుప్పాల లక్ష్మీనారాయణ, బొల్లు రమేష్, భావిశెట్టి నారాయణరావు, వాసుపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

జొన్నవలస ఉపాధ్యాయులు చుక్కల పైడితల్లి

ప్రజాశక్తి - విజయనగరం

పిల్లలకు చదువు నేర్పించే విద్యాశాఖలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని నా మొత్తం ఉద్యోగ జీవితం ఎటువంటి ఒడిదుడుకులకూ లోనవకుండా విజయవంతంగా పూర్తిచేయగలిగానని జొన్నవలస స్కూల్ ఉపాధ్యాయుల చుక్కల పైడితల్లి తెలిపారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకున్నారు. వృత్తి రీత్యా తమ తల్లిదండ్రులు చేనేత కుటుంబం అయినప్పటికీ తాను ఉపాధ్యాయునిగా పనిచేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు.

కుటుంబ నేపథ్యం : బలిజిపేట మండలం, అరసాడ గ్రామానికి చెందిన చుక్కల రాములు, పోలమ్మ దంపతులకు నేను రెండువ సంతానం. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు అరసాడ గ్రామంలో 8వ తరగతి నుంచి 10వతరగతి వరకు అజ్జాడ హైస్కూల్లో, ఇంటర్మీడియట్, డిగ్రీ బొబ్బిలి రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు కళాశాలలో చదివాను. అనంతరం బిఎస్‌సి 2వ సంవత్సరం చదువుతుండగానే విజయనగరం టిటిసిలో టీచర్ ట్రైనింగ్ పూర్తిచేశాను. తదనంతరం ఆ గ్రామంలో అనియత విద్యాకేంద్రం నడిపించాం. 1992లో

పైడితల్లి ని సత్కరిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ (ఫైల్)

ఇందిరాతో వివాహం జరిగింది. ఇద్దరు అబ్బాయిలు అనీల్‌కుమార్, సునీల్‌కుమార్. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారని ఆయన తెలిపారు.

ఉద్యోగ జీవితం : విజయనగరం జిల్లా, సాలూరు మండలం, పెద్దవలస పాఠశాలలో 1989 సంవత్సరం సెప్టెంబర్ 25న ఉపాధ్యాయుడుగా చేరాను. మూడేళ్లపాటు 1992 వరకు అక్కడే పనిచేశాను. అనంతరం నా సొంత మండలం బలిజిపేటకు 1992లో బదిలీపై వెళ్లి 2017 వరకు గౌరీపురం, నారాయణపురం గ్రామాల్లో సుమారు 25 సంవత్సరాలు పనిచేశాను. 2017 నుంచి 2025 వరకు విజయనగరం మండలం, కోరాడపేటకు బదిలీపై వచ్చి పనిచేశాను. ఇటీవల జరిగిన బదిలీల్లో జొన్నవలస హైస్కూల్‌కు బదిలీపై వచ్చాను. 2024 సంవత్సరంలో గురుపుజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది. బలిజిపేటలో పనిచేసినప్పటి నుంచి ఎపిటిఎఫ్ సంఘంలో వివిధ హోదాల్లో పనిచేసి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశాను. విజయనగరం వచ్చిన తరువాత కూడా విజయనగరం ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులుగా పనిచేశాను. దీంతో పాటు జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో సేవలందించి సంఘానికి నా వంతుగా సహాయ సహకారాలు అందించాను. నేను ఉపాధ్యాయునిగా 36ఏళ్ల సర్వీసులో నమ్మేది రెండే రెండు, కాలం, కర్తవ్యం, సంఘ సేవ పరంగా విద్యా ప్రగతి, సమాజ శ్రేయస్సు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేశాను. నా సర్వీసు మొత్తం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన పై అధికారులకు, సహచర ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపినట్లు చుక్కల పైడితల్లి తెలిపారు.

ప్రజలకు నిరంతర సేవలు అందించాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రజలకు నిరంతరం సేవలు అందించాలని స్థానిక అధికారులను వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలి రెడ్డి శ్రీనివాస్ నాయుడు కోరారు. వైసిపి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణతో కలిసి ఆయన చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని హట్కో కాలనీ, అంబేద్కర్ నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కారణంగా తాగునీరు వాడకల్లో జాగ్రత్త వహించాలని, బోర్ల దగ్గర కలుషితం చేయకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు తలెత్తితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, ఎల్ ప్రభాత్ కుమార్, కోరుకొండ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు మానుకోండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

నియోజకవర్గం తెలుగు తమ్ముళ్ళు రాజకీయ కక్ష సాధింపులు మానేసి పాలనపై దృష్టి సారించాలని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వల్లి రెడ్డి శ్రీనివాస నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, నియోజకవర్గం ప్రచార విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ హితవు పలికారు. మండలంలో పత్తికాయవలస, ముల్లుపేట, బైరెడ్డిపేట, మెట్టపల్లి, గొల్లలములగాం, కరకాం, గచ్చలవలస గ్రామాలకు సంబంధించిన రేషన్ షాపు డీలర్లను తొలగించడం అన్యాయమని స్థానిక తహశీల్దార్ డి. ధర్మరాజుకు గురువారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు చెప్పిన మాటలు నమ్మి నియోజకవర్గంలోని డీలర్ల పైన ప్రజల పైన కక్ష సాధింపు చర్యలకు దిగవద్దని తహశీల్దారుని వారు కోరారు. గత 40 ఏళ్లుగా నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్‌లకి సిఫార్సు లేటర్లు ఎమ్మెల్యే పంపించడం అనేది లేదని అలాంటిది ప్రజలపై కేసులు కట్టమని

తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

స్థానిక ఎమ్మెల్యే నేరుగా సిఫార్సు లేటర్లు పోలీస్ స్టేషన్లకు రాయడం తగదని ఆరోపించారు. గతంలో ఎన్నడు లేని విధంగా విద్యుత్ బిల్లులు మోత మోగుతుంటే ప్రజల పక్షాన అది మాట్లాడకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. కూటమి అధికారంలోకి వస్తే నెలరోజుల లోపలే ఆర్ఇసిఎస్ సంస్థని తీసుకువస్తామని మాట ఇచ్చిన ఎమ్మెల్యే మాట ఏమైనట్లని వైసిపి నాయకులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ దన్నాన జనార్దన్ రావు, పతివాడ రాజారావు, చందక శ్రీనివాసరావు, రఘు మండ త్రినాధరావు, కొమ్ము చిరంజీవి, కొసిరెడ్డి రమణ, కర్రోతు ప్రసాద్, మహంతి ఉమామహేశ్వరరావు, అలిగి శ్రీనివాస రావు, గవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, బక్కునాయుడుపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం తెల్లవారు 7గంటలకు జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు ఏ విధంగా చెత్త సేకరణ చేస్తున్నారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకు పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు చెత్త సేకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పరిశుభ్రంగా లేకపోతే కలిగే అనర్థాలను వివరించారు. ఎస్‌డబ్ల్యూపిసిను పరిశీలించారు. ఈ సందర్భంగా వేపాడ, బక్కునాయుడపేట మహిళలు తాగునీటి సమస్య గూర్చి వివరించారు. స్పందించిన సిఇఒ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణతో వెంటనే మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మరోసారి తాగునీటి సమస్య తన దృష్టికి రాకూడదని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇఒపిఆర్‌డి రవికుమార్, ఎఒ ఆనంద్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వేపాడ గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని అప్పన్న దొరపాలెం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఉదయం జిల్లా

వేపాడ: గ్రామస్తులకు పలు సూచనలు చేస్తున్న జెడ్‌పి సిఇఒ

పంచాయతీరాజ్ అధికారి మల్లికార్జున్ రావు, ఎంపిడిఒ రమణయ్య సంయుక్తంగా పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని, సురక్షిత తాగునీటి ట్యాంకును, పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు సంతృప్తి కరంగా ఉన్నాయని తెలిపారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇంటి పన్నులు అప్‌డేట్ చేయండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఇంటి పన్నులు రెండు రోజుల్లో అప్‌డేట్ చేయాలని ఎంపిడిఒ కె.సురేష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న 19 పంచాయతీలలో 17 వేల ఇళ్లకు సంబంధించి ఇంటి పన్నుల అప్‌డేట్ విషయంలో అశ్రద్ధ వహించకూడదని ఆయన గ్రామస్థాయి అధికారులకు సూచించారు. మండలంలో ఉన్న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, పౌల్ట్రీ ఫారంలో ఉన్న కార్యాలయాలు, స్టాఫ్ క్వార్టర్స్ వంటి వాటిపై కూడా పన్నులు అప్‌డేట్ చేయాల్సిందేనని అధికారులకు సూచించారు. రెండు రోజులలో అప్‌డేట్ చేసి నివేదికను అందజేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో ఇళ్ల పన్నుల వసూళ్లకు చర్యలు

రామభద్రపురం: గ్రామపంచాతీలలో ఇళ్ల పన్నుల వసూళ్లకు ప్రత్యేక పోర్టల్లను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని డిప్యూటీ ఎంపిడిఒ మరడ వెంకటరమణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్నుల వసూళ్లు చేపడతామని తెలిపారు. దీనిపై పంచాయతీరాజ్ కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చాయని, స్వర్ణ పంచాయతీ పోర్టల్లో యజమాని వివరాలు, ఆధార్, మొబైల్ నెంబరు ఆన్‌లైన్ చేసి నిర్ధారించుకుంటామని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

దుర్గంధం నుంచి కాపాడండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అధ్వానంగా మారిన నగర పంచాయతీ రహదారి వెదజల్లే దుర్గంధం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక మొయిద జంక్షన్ నుంచి థామస్‌పేట మీదుగా జరజాపుపేట రహదారి అధ్వానంగా మారి మురుగు నీరుతో కంపు కొడుతోందని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా మొయిద కూడలి సమీపంలో చికెన్ సెంటర్ వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న కాలువలో మురుగు నీరు, చెత్త పేరుకుపోయి రోడ్డుపైకి వచ్చి దుర్గంధంగా మారింది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, వ్యాపారస్థులు, వాహన దార్లు, పాదాచార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి ప్రధాన కాలువ పూడిక పోవడంపై పలుమార్లు రహదారి భవనాలు శాఖ అధికార్లు, నగర పంచాయతీ అధికార్లకు ఫిర్యాదు చేసినప్పటికి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు కాలువను చూపిస్తున్న స్థానికులు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

పూడికలు తొలగించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు చెప్పారు. చాలా ఏళ్లుగా మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేట వెళ్లే రహదారి ప్రధాన కాలువ కల్వర్టు పూడుకు పోయి మురుగు నీరు రోడ్డు మీద ప్రవహించి కార్మికులు, వాహన దారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ని సార్లు చెప్పిన రహదార్ల భవనాలు శాఖ అధికార్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు కాబట్టి వెంటనే కాలువ మరమ్మత్తులు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సిబ్బంది తప్పుడు నివేదిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమణల నుంచి తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త జి.బి. నాయుడు స్పందనలో ఫిర్యాదు చెయ్యగా అందుకు స్థానిక రెవెన్యూ సిబ్బంది తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఇటువంటి వాటిపై జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ సిబ్బంది, ఆక్రమణదారుల పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కిల్తంపాలెం రెవెన్యూ పరిధిలో గల 38 సర్వే నంబర్‌లోని 70 సెంట్లు ప్రభుత్వ భూమి, చెరువులు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. సర్వే చేసి ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ఫిర్యాదు చేయగా ఆ భూములో కొంత ఫిర్యాదుదారుడే ఆక్రమించినట్లుగా రెవెన్యూ అధికారులు ఎండార్స్‌మెంట్‌లో ఫిర్యాదు దారుణకు వివరణ ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. రెవెన్యూ అధికారులు వారి తప్పులు ఎక్కడ బయటపడతాయోనని గందరగోళంలో ఏదో ఒక నివేదిక తయారు చేసి ఫిర్యాదుదారునికి ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి మరల సమగ్ర దర్యాప్తు జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతామన్నారు.

అయ్యంకి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- గంట్యాడ

గ్రంథాలయం అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు మరువలేమని గ్రంథాలయ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథా లయ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి మహేష్

డెంకాడ: అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణ గ్రంథాలయ ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథా లయ అధికారి స్వర్ణకుమారి, పాఠకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలు ఏర్పాటుకు అయ్యంకి చేసిన కృషిని కొనియాడారు. గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెర్లాం: స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి ఘనంగా నిర్వహించారు. వెంకటరమణయ్య చిత్రపటానికి హై స్కూల్ క్రాఫ్ట్ మాస్టర్ విషు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

విజయనగరం నగరపాలక సంస్థ

పత్రికా ప్రకటన

ఆన్ లైన్ లేఔట్ ప్లాన్ నెం: 1093/0001/LP/VZM/2024

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునదేమనగా శ్రీ కె.వి. గోపాలాచార్యులు, విజయనగరం నందలి గాజులరేగ సర్వే సంఖ్య 11-10 Part & 11-11 Partలో ఎకరములు 2.00 సెంట్లు గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్ లైన్ నెం : 1093/0001/LP/VZM/2024 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియజేయడమైనది.

సం/- కమిషనరు, విజయనగరం నగరపాలక సంస్థ